క్లుప్తంగా

ఉషూలో ప్రతిభ చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): ఉషూలో ప్రతిభ చాటాలని ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్ పాఠశాలల ఉషూ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏటా ఒలింపిక్ డే పురస్కరించుకొని బాలబాలికలకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. అలాగే సోమవారం కర్నూలు నగరంలో నిర్వహిస్తున్న ఒలంపిక్ డే పరుగులో ప్రతి క్రీడాకారుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ సంఘం నిర్వహణ కార్యదర్శి సునీల్‌కుమార్, ఉషూ సంఘం కార్యదర్శి టి.శ్రీనివాసులు, మాస్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

ఉత్తమ జీవనానికి సోపానాలు ఇతిహాసాలు



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఉత్తమ జీవనానికి భారత, భాగవత, రామాయణ ఇతిహాసాలు సోపానాలుగా నిలుస్తాయని ఇస్కాన్ ధర్మ ప్రచారకులు గంగావతి హరిదాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో యోగిని ఏకాదశి వేడుకలు, భగవద్గీత తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం వైష్ణో కృప చైతన్య ప్రభు సందేశమిస్తూ భగవద్గీత పఠనం, శ్రవణంతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. జటిలమైన సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయన్నారు. పిల్లలకు విద్యార్థి దశ నుంచే దేశభక్తి, ఆధ్యాత్మిక అంశాలపై ఆసక్తి కలిగేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

కర్నూలు (టౌన్): నగరంలోని నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్ల సమ్మె నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు వెల్లడించారు. కమిషనర్ ఆదివారం అశోక్‌నగర్‌లో నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు వేతనాల విషయంపై సమ్మె చేస్తున్నారన్నారు. అయినప్పటికీ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాత్కాలిక కార్మికులతో నీటి సరఫరా చేస్తున్నామన్నారు. సమస్యలు ఉంటే స్థానికంగా ట్యాప్ ఇన్‌స్పెక్టర్, అమినిటీస్ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి ఖాజాపాషా, నగర నాయకులు అబ్దుల్‌దేశాయ్ పిలుపునిచ్చారు. ఆదివారం 10వ వార్డులో ఓల్డ్ సిటీ భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం మహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రంలోని ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పి పది గంటల పని విధానం తెచ్చారని, దీంతో మహిళలు రాత్రిళ్లు కూడా ఉద్యోగాలు చేయాలా అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణ త్యాగంచేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చాంద్‌బాషా, సూరి, మహబూబ్ బాషా, నాసిర్, సాధిక్ పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో కొందరు బ్రాహ్మణ పెద్దలు ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని చెబుతూ పేద బ్రాహ్మణుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, అర్హులైన బ్రాహ్మణులు దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఇళ్ల స్థలాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేస్తుండటం, నకిలీ పట్టాలు ఇవ్వడంపై ఇప్పటికే కర్నూలు 3వ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దళారులను అరెస్ట్ చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను కూడా కోరనున్నట్లు చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి ఎంకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు (టౌన్): వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింతగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యుడు హఫీజ్ ఖాన్ సూచించారు. వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం కార్యదర్శిగా నియమితులైన రెడ్డి మంజులతను ఆయన తన నివాసంలో శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, రాష్ట్ర పదవిలో పార్టీ కోసం సేవలు అందించాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలను అన్ని విధాలుగా మోసం చేసిందని, ప్రజలు, మహిళల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.



వైఎస్సార్‌సీపీ అంగన్‌వాడీ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన రెడ్డి మంజలను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

టెర్రస్ గార్డెనింగ్‌లో రాణించాలి

- మొక్కలు ఇచ్చిపుచ్చుకుంటేనే రాణించే అవకాశం
- బ్లాక్, కస్తూరి పసుపు పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలో టెర్రస్ గార్డెనింగ్‌ను మరింత పోత్సహించేందుకు ఒకరికొకరు అన్ని విధాలుగా సహకరించుకోవాలని టెర్రస్ గార్డెన్ నిపుణుడు హరికృష్ణ సూచించారు. ఆదివారం కర్నూలు కొత్త బస్టాండు ప్రాంతంలో టెర్రస్ గార్డెనింగ్‌లో రాణిస్తున్న రాఘవేంద్రరావు కార్యాలయంలో టెర్రస్ గార్డెన్ గ్రూపు సభ్యుల సమావేశం జరిగింది. వంద మంది సభ్యులు పాల్గొని ఇంటి పంటలో రాణిస్తుండటం పట్ల అభినందనలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా లాగ్డాద్ పసుపు, నల్ల పసుపు, కస్తూరి పసుపు సరఫరా చేశారు. టెర్రస్ గార్డెన్ నిపుణుడు తోట హరికృష్ణ మాట్లాడుతూ.. వందలాది మంది



హాజరైన టెర్రస్ గార్డెనింగ్ గ్రూపు సభ్యులు

ఇంటి పైకప్పు మీద వివిధ మొక్కలు పెంచుతున్నారని, దీన్ని మరింత పోత్సహించాలన్నారు. ఇంటిపంటతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. సభ్యులు ఒకరికొకరు మొక్కలను ఇచ్చిపుచ్చుకోవాలని, అపుడే గార్డెనింగ్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంటి పంటలో రాణించడంలో ఎదురవుతున్న ఇబ్బందులు, మరింత అభివృద్ధి చేసుకోవడం, మొక్కల పెంపకం, పోషకాలు అందించడం వంటి వాటిపై అవగాహన కల్పించారు. టెర్రస్ గార్డెన్ నిపుణుడు రాఘవేంద్రరావు, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

కర్నూలు సిటీ: ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె క్రిష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన మూడు విడతల కరువు భత్యాన్ని చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం స్కూళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చేపట్టిన నాడు-నేడు పనుల్లో భాగంగా మొదలు పెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. విద్యార్థులందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలతో పాటు,



మాట్లాడుతున్న డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్రె క్రిష్ణ

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు. డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రాముడు, గట్టు తిమ్మప్ప, రాష్ట్ర నాయకులు రత్నం ఏసేపు, మజాహర్ బాషా, జిల్లా కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో పర్యవేక్షకుల నిర్లక్ష్యం కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. అకడమిక్ బిల్డింగ్- 1 రెండో అంతస్తులో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సు నిర్వహించే డిపార్ట్‌మెంట్ ఉండేది. వివిధ కారణాలతో నాలుగు సంవత్సరాల క్రితమే ఆ కోర్సును తీసివేశారు. అయితే ఆ కోర్సుకు సంబంధించిన డిపార్ట్‌మెంట్‌లో కోర్సు పేరు, టీచింగ్ ఫ్యాకల్టీ పేర్లు ఉన్న బోర్డులు అలాగే ఉండటం చూసిన వారు ఆశ్చర్యపోతున్నారు. వర్సిటీలో కోర్సే లేకున్నా ఇంత నిర్లక్ష్యమా అని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.



ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సు పేరు, ఫ్యాకల్టీ పేర్లు ఉన్న బోర్డు

నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

కర్నూలు (టౌన్): సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొంటే తప్పనిసరిగా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర ఉన్న వారికి, చెడు నడత కలిగిన వ్యక్తులను కౌన్సెలింగ్ చేయాలన్నారు.

29న గురుపూజోత్సవం

కర్నూలు కల్చరల్: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉదయం 8 గంటలకు వీఆర్ కాలనీలోని వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్‌ఎస్‌ఎస్ నగర సంఘ్ చాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త మహామంత్రి కోటేశ్వర శర్మ ముఖ్య వక్తగా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

అవ్వ మందలించినందుకు మనవడి ఆత్మహత్య

కర్నూలు: అవ్వ మందలించినందుకు మనవడు గోపి (25) ఆత్మహత్య చేసుకున్న సంఘటన కర్నూలులో వెలుగు చూసింది. నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని గీతానగర్‌లో వృద్ధురాలు రుక్మిణమ్మ నివాసం ఉంటుంది. కొడుకు సురేష్, మనవడు గోపి ఆమె వద్దనే ఉంటున్నారు. సురేష్ గుంటూరులో గౌండ పని చేస్తూ ఖర్చుల నిమిత్తం ఇద్దరికి డబ్బులు పంపేవాడు. అయితే చెడు వ్యసనాలకు బానిసై డబ్బులు ఖర్చు చేస్తూ, అప్పులు చేస్తుండటంతో అవ్వ మందలించింది. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి రేకుల షెడ్డులో ఐరన్ రాడ్డుకు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న నాలుగవ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. నాలుగవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీ ఎంఈయూకు గుర్తింపు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్‌కు జీఓ 344లో ఉన్న బెనిఫిట్స్ ఇవ్వాలని ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని, తద్వారా యూనియన్‌కు తిరిగి గుర్తింపు లభించినట్లయ్యిందని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.బాలునాయక్ చెప్పారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ 1953 నుంచి వైద్య ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకులు అనేక పోరాటాలు చేసి విజయం సాధించారన్నారు. అప్పటి నుంచి యూనియన్ గుర్తింపు కొనసాగుతూనే ఉందన్నారు. కొన్ని కారణాల వల్ల హక్కులను ప్రభుత్వాలు గుర్తించలేదని, 2023 నుంచి ఇతర సంఘాల లాగా ప్రీవిలేజ్ ఇవ్వాలని అనేకసార్లు విన్నవించామన్నారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరిబాబు ఏపీ హైకోర్టును ఆశ్రయించారన్నారు. దీంతో జీఓ 344లో ఉన్న బెనిఫిట్స్ ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. యూనియన్ అంటే నాల్గవ తరగతి ఉద్యోగులే కాదని, పారామెడికల్ సిబ్బంది, స్టాఫ్‌నర్స్, హెడ్‌నర్సు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, వైద్య ఉద్యోగులందరినీ కలుపుకుని త్వరలో కర్నూలు జిల్లా, సిటీ కమిటీలను ఏర్పాటు చేసి బలోపేతం చేస్తామన్నారు.

విద్యుత్ అంతరాయం ఉంటే సంప్రదించండి

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరంలోని క్యాంపస్ సెక్షన్ పరిధిలోని అన్ని కాలనీలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషాద్రి తెలిపారు. ఈ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగితే 08518-229862, 7382787842 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వవచ్చని సూచించారు. గాయత్రీ ఎస్టేటు, దేవనగర్, లక్ష్మీనగర్, శ్రీరాంనగర్, బిర్లాగేట్, ఎండోమెంటు కాలనీ, మద్దూర్‌నగర్, బి.క్యాంపు, సి.క్యాంపు, డాక్టర్స్ కాలనీ, శ్రీలక్ష్మీనగర్, కమలానగర్, కిసాన్ నగర్, మహాలక్ష్మీనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, పార్థసారథి నగర్, గణేష్‌నగర్, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సోమిశెట్టినగర్, టిలికాంనగర్, ధనలక్ష్మీనగర్, చెక్ పోస్టు ఏరియా, గఫూర్‌నగర్, అమ్మహాస్పిటల్ ఏరియా, హౌసింగ్ బోర్డు కాలనీ, మారుతీనగర్, మారుతీ మెగాసిటీ, 100 అడుగుల రోడ్డు, వాసవీనగర్, నందికొట్కూర్ రోడ్డు, జొహరాపురం రోడ్, లక్ష్మి టౌన్‌షిప్, పోస్టల్ కాలనీ, సింధూఎస్టేటు, ఎలుకూరు ఎస్టేటు తదితర కాలనీల వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని సూచించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. అలాగే సోమవారం కలెక్టరేట్ తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని ఆయన వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

అర్జీదారులు సమర్పించిన దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అలాగ అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నగర పాలక సంస్థలో

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైన సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

పదోన్నతి ఏఈఓలకు సంఘంలో సభ్యత్వం

కర్నూలు(అగ్రికల్చర్): గ్రామ వ్యవసాయ సహాయకులుగా పనిచేస్తూ ఇటీవల పదోన్నతులు పొందిన వారికి వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘంలో సభ్యత్వం కల్పించడం శుభపరిణామమని ఉమ్మడి కర్నూలు జిల్లా ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి తెలిపారు. ఆదివారం కర్నూలు ఏడీఏ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాష ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌జీవో అసోషియేషన్ నేత వెంగళరెడ్డి సభ్యత్వ నమోదు పత్రాలను అందచేశారు. ఆయన మాట్లాడుతూ...సంఘంలో ఉండటం వల్ల అన్ని విధాల రక్షణ ఉంటుందని తెలిపారు. సభ్యతం తీసుకున్న నూతన ఏఈఓలను జిల్లా ఎన్‌జీవో అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళరెడ్డితో పాటు కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, రాష్ట్ర వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాంద్‌బాష, మనోహర్ తదితరులు అభినందించారు. జిల్లా నాయకులు నరసింహుడు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజయేంద్రతీర్థులకు ఏకాదశి పూజలు

హొళగుంద: స్థానిక కోట ఆంజనేయస్వామి ఆలయంలో వెలసిన విజయేంద్రతీర్థుల 411 ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం అర్చకులు ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి నిర్మల్య విసర్జన, మంగళ హారతి, సాయంత్రం పండితుల ప్రవచనాలు, భజన మండలి ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు చేపట్టారు. అలాగే రాఘవేంద్ర, విజయేంద్రతీర్థుల మూల విరాట్‌లకు రోజువారి పూజలు జరిపించారు. సోమవారం మధ్యారాధన, మంగళవారం ఉత్తరాధన కార్యక్రమాలు జరగనున్నాయి. ఉత్తరాధన రోజు రథోత్సవం, ఇతర ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఆరాధనోత్సవాలు ముగుస్తాయని అర్చకులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు తెలిపారు.



చిన్నటేకూరులో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

> ఈ దృశ్యం చిన్నటేకూరులో ప్రధాన రోడ్డు పక్కన ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వివిధ గ్రామాలకు చెందిన వందల వాహనాలు ప్రయాణిస్తుంటాయి. రోడ్డు పక్కన చెత్తా చెదారం ఉండడంతో దుర్వాసన వస్తోందని ప్రయాణికులు, గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

జెసాప్ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు (టౌన్): జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జెసాప్) బలోపేతానికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.విజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక జెడ్పీ ప్రాంగణంలోని మండల పరిషత్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యం ఒత్తిడితో కూడిన వృత్తిలో పనిచేసే జర్నలిస్టులకు క్రీడలు ఎంతో ఉపశమనం కలిగిస్తాయన్నారు. వచ్చేనెలలో శ్రీలంకలోని కొలంబోలో నిర్వహించనున్న జర్నలిస్టుల క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఇప్పటికే జెసాప్‌కు ఆహ్వానం అందిందన్నారు. రాష్ట్రంలోని జర్నలిస్టులు ఈ పోటీలకు సిద్ధంగా ఉండాలన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, వెంకటరెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన జెసాప్ కమిటీ సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక : సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు (చిరంజీవి) ఉపాధ్యక్షుడు (మిన్నెల్లా), ప్రధాన కార్యదర్శి (వెంకటేశ్వర్లు), నిర్వహణ కార్యదర్శి (శ్యామ్) కోశాధికారి (శివరాజ్‌కుమార్), ఎగ్జిక్యూటివ్ సభ్యులు విజయ్, భార్గవ్, సురేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులుగా బి.మోహన్, అబ్రహం, రవికుమార్, జర్మియా, ప్రకాష్‌లను ఎన్నుకున్నారు.

మహనీయుల స్ఫూర్తితో డీవైఎఫ్ఐ అడుగులు



డీవైఎఫ్ఐ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): 1980లో ఆవిర్భావం నాటి నుంచి స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అల్లూరి సీతారామరాజు, అంబేడ్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో డీవైఎఫ్ఐ ముందుకు సాగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, మాజీ నాయకులు సీహెచ్ సాయిబాబా, ఎస్ఎండీ షరీఫ్, గౌస్‌బాషా, నగర కార్యదర్శి హుస్సేన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో న్యూసిటీ, ఖండేరివీధిలో ఓల్డ్‌సిటీ నగర మహాసభలను నిర్వహించారు. అతిథులు డీవైఎఫ్ఐ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.10 వేల జీతం ఇస్తామని చెప్పి 2.5 లక్షల మంది వలంటీర్లను రోడ్డున పడేసిందని, 20 వేల మంది ఎండీయూ ఆపరేటర్ల కడుపులు కొట్టిందని, వారందరికీ ఉద్యోగాల పునరుద్ధరణ కోసం పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. అనంతరం డీవైఎఫ్ఐ న్యూసిటీ, ఓల్డ్‌సిటీ కమిటీలను ఎన్నుకున్నారు. ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీబీ

కర్నూలు కల్చరల్: గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు తెలుగు వారి ఇంటింటా వినిపిస్తుంటాయని ఘంటసాల ఫేమ్ టి.బాలకామేశ్వరరావు అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో పద్మభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెల్లూరులో జన్మించిన బాలసుబ్రహ్మణ్యం సినీ రంగంలో గిన్నిస్ రికార్డును సృష్టించారన్నారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, ఇతర భాషల్లో 40 వేల పాటలు పాడిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ప్రపంచ సంగీత దినోత్సవం కలిపి నిర్వహించడం జరిగిందన్నారు. ఇకపై కర్నూలు ప్రజలకు వినోదం కల్పించడం కోసం ప్రతి ఆదివారం ఇతర ప్రాంతాల నుంచి కళాకారులను ఆహ్వానించి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా గాయనీగాయకులు టీ.బాల కామేశ్వరరావు, టీ.హనుమంతరావు, పి.రాధిక, ప్రియాంక, సుబ్బలక్ష్మిని సత్కరించారు. అనంతరం గాయనీ గాయకులు బాలసుబ్రహ్మణ్యం, ఘంటసాల, పి.సుశీల, లీల జిక్కి పాడిన అనేక సినిమా పాటలను పాడి ప్రేక్షకులను అలరించారు. బీసీ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, పెన్షనర్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి, మున్సిపల్ మేనేజర్ చిన్న రాముడు, కేవీ రమణ, కన్వీనర్స్ బీఎస్ఎన్ రావు, బాలవెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



గాయకులను సత్కరిస్తున్న దృశ్యం

గుంతలమయంగా రోడ్డు





గుంతలమయంగా మారిన లక్ష్మీపురం రోడ్డు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని లక్ష్మీపురం రోడ్డు గుంతలమయంగా మారింది. 44వ జాతీయ రహదారి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు సుమారుగా రెండు కిలో మీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డుపై నిత్యం వాహనదారులు ప్రయాణిస్తుంటారు. కొన్ని చోట్ల రోడ్డు ధ్వంసమై కంకర తెలింది. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే గ్రామీణ, పట్టణ రోడ్లను మరమ్మతులు చేస్తామని, అవసరమైన చోట్ల రోడ్లు నిర్మిస్తామని హామీలు ఇచ్చిందే తప్పా అమలు చేయడంలో విఫలమైందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

అన్నదమ్ముల ఘర్షణ.. ట్రాక్టర్‌కు నిప్పు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎస్.నాగలాపురం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ట్రాక్టర్‌కు నిప్పంటించిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలు... గ్రామానికి చెందిన నాగేశ్వరరావు, రాందాసు అన్నదమ్ములు. కొంత కాలంగా ఆస్తి విషయంలో మనస్పర్థలు ఉన్నాయి. ఆదివారం నాగేశ్వరరావుకు చెందిన ట్రాక్టర్ రాందాసు స్థలంలో ఉంచడంతో.. తన స్థలంలో ఎలా పెడతావంటూ రాందాసు గొడవపడ్డాడు. బాటిల్లో ఉన్న పెట్రోల్ ట్రాక్టర్ ఇంజిన్‌పై వేసి నిప్పంటించటంతో మంటలు చెలరేగాయి. వెంటనే అక్కడ ఉన్నవారు మంటలను ఆర్పివేశారు. మంటలు ఆర్పకపోయింటే ట్రాక్టర్ కాలిపోయేదని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయంపై రూరల్ ఎస్ఐ శ్రీనివాసులను అడుగగా అన్నదమ్ములు గొడవపడినట్లు మా దృష్టికి వచ్చిందని. కేసు నమోదు చేయలేదని, బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని చెప్పారు.



ట్రాక్టర్‌కు నిప్పంటించిన దృశ్యం

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- విజృంభిస్తున్న ఈగలు, దోమలు
- సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- పట్టించుకోని అధికారులు

కల్లూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. మండలంలో 18 గ్రామ పంచాయతీలు, మజారా గ్రామాలతో కలిపి మొత్తం 26 గ్రామాలు ఉన్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీధుల్లో, డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. మురుగు, చెత్త, దోమలు, ఈగలు, లార్వాల సంతతికి నెలవుగా మారాయి. కొన్ని గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. దీంతో గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలు చెత్త చెదారంతో నిండిపోయి పూడికతో పాటు కొన్ని గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపైకి వస్తోంది. డ్రైనేజీ కాలువల్లో చెత్తచెద్దారం, పేపర్లు, సీసాలు ఉండడంతో మురుగు నీరు ముందుకు పారడం లేదు. మురుగు నీరు నిల్వ ఏర్పడి భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుద్ధ్య లోపంతో దోమలు, ఈగలు, ల్వారాలు ప్రబలుతున్నాయి.

> ఈ దృశ్యం బస్తిపాడు గ్రామంలోనిది. గ్రామ సచివాలయం ఎదురుగా ఉన్న డ్రైనేజీ కాలువలో చెత్తచెదారం, పేపర్లు, సీసాలతో నిండి ఉంది. వాతావరణ మార్పుల వల్ల డ్రైనేజీ ఈగలు, దోమలు, లార్వాలకు నెలవుగా మారింది. నిత్యం ప్రజలు సచివాలయానికి వివిధ పనుల నిమిత్తం వస్తుంటారు. కాలువ నుంచి దుర్వాసన వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలో ఉన్న చెత్త చెదారం తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బస్తిపాడులో చెత్తచెదారంతో నిండిన డ్రైనేజీ

నెరవేరని లక్ష్యం

కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్యంపై అవగాహన కల్పిస్తోంది. అయితే మండలంలోని కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమ లక్ష్యం నెరవేరడం లేదు. గత కొంతకాలంగా గ్రామాల్లో ఎక్కడా పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య పనులు చేపటడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామాల ప్రజల కోరుతున్నారు.